భయానకంగా ఖాళీ స్థలాలు

- చెత్తను డంప్ చేస్తున్న స్థానికులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నగర పాలక సంస్థ

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా వదిలేసిన నివాస స్థలాలు డంపింగ్ యార్డులుగా, విష సర్పాలకు నిలయంగా మారడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 5,000 ఖాళీ స్థలాలు అధికారిక లెక్కల ప్రకారం నమోదై ఉన్నాయి. వీటిలో నిర్మాణాలు చేపట్టకుండా దశాబ్దాల కాలంగా వదిలివేయడంతో తుప్పలు పెరిగిపోయి విష సర్పాలకు ఆవాసాలుగా మారిపోయాయి. దీనివల్ల స్థానికంగా చుట్టుపక్కల నివాసాలు ఉండే ప్రజలు చీకటి పడితే చాలు భయం భయంగా గడపాల్సిన దుస్థితి నెలకొంది. నగరంలో ముఖ్య ప్రాంతాల్లో సైతం ఖాళీ స్థలాల్లో భారీగా తుప్పలు పెరిగిపోయి డంపింగ్ యార్డులు మాదిరిగా తయారయ్యాయి. స్థలాలు ఖాళీగా ఉండటంతో స్థానికులు వ్యర్థాలను ఖాళీ స్థలాల్లోనే


గాంధీపురంలో ఖాళీ స్థలంలో పెరిగిన తుప్పలు


దానవాయిపేట మెయిన్‌రోడ్డులోని ఖాళీ స్థలంలో పెరిగిపోయిన తుప్పలు


డంపింగ్ యార్డులా తయారైన ఖాళీ స్థలం

విసిరి వేస్తున్నారు. నిరంతరాయంగా ఈ పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ సంబంధిత నగరపాలక సంస్థ సిబ్బంది అధికారులు అటువైపు దృష్టి సారించడం లేదు. ఖాళీ స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో తుప్పలు పెరిగిపోవడం వ్యర్థాలతో నిండిపోతున్న రెవెన్యూ విభాగం, పారిశుధ్య విభాగం ఏ విధమైన చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని నగర ప్రజలు వాపోతున్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నమోదైన ఐదువేల ఖాళీ స్థలాల్లో సుమారు 2,700 ఖాళీ స్థలాలకు సంబంధించిన యజమానులే ఎవరో తెలియని పరిస్థితి నెలకొందని అధికారులు చెబుతున్నారు. ఖాళీ స్థలాల్లో పెరుగుతున్న వ్యర్థాలు, తుప్పలను తొలగించే విధంగా చర్యలు చేపట్టేందుకు నోటీసులు ఇవ్వాల్సిన అధికారులు ఆవిధమైన చర్యలు చేపట్టక పోవడం విడ్డూరం. ప్రజాప్రయోజనాల దృష్ట్యా చర్యలు చేపట్టాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కపెట్టడంతో ప్రధాన ప్రాంతాల్లో సైతం పెరిగిన తుప్పలతో విష సర్పాల సంచారంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఖాళీ స్థలాలలో తుప్పలను తొలగించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదకరంగా ఉన్నాయి



ఖాళీ స్థలాలలో ఇళ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో పెద్ద ఎత్తున చెట్లు, తుప్పలు పెరిగిపోయాయి. విషసర్పాలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. చీకటి పడితే చాలు చుట్టుపక్కల వారు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలంలోని తుప్పలను తొలగించే ప్రయత్నాలు చేపట్టకపోవడం ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– బైరెడ్డి పార్వతి, రాజమహేంద్రవరం

అధికారులు స్పందించాలి



నగరంలో ఖాళీ స్థలం కనిపిస్తే వ్యర్థాలను దానిలోకి విసిరివేసేందుకు అధిక సంఖ్యలో ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇళ్లలోని వ్యర్థాలను నిత్యం నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు అందించే అవకాశం ఉన్నప్పటికీ ఆ విధమైన చర్యలు చేపట్టడం లేదు. ఖాళీ స్థలాల్లో వ్యర్థాలను విసిరి వేయడంతో విష సర్పాలకు, పందులకు ఆవాసాలుగా మారిపోతున్నాయి. ప్రజలు ఇలా విసిరేసిన వ్యర్థాలతో స్థానికంగా తీవ్ర దుర్గంధం అలముకుంటోంది. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– గట్టి ప్రభు, రాజమహేంద్రవరం

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు


కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ఖాళీ స్థలాలను యజమానులు శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. నగరంలో చాలాచోట్ల నివాసాల మధ్యలో ఏళ్ల తరబడి ఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా, పిచ్చి మొక్కలతో తీవ్ర అసౌకర్యంగా ఉన్నాయన్నారు. ఫలితంగా దోమలు, క్రిమి కీటకాలు, పాములు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిపై ఇప్పటికే పలు ఫిర్యాదులు కూడా అందాయన్నారు. దీంతో నగరంలో స్వచ్ఛతను కాపాడేందుకు వార్డు సచివాలయాల వారీగా స్థల యజమానులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల మధ్యలోని ఖాళీ స్థలాల్లో కంపచెట్లు మొలిచి అపరిశుభ్రంగా ఉంటే నోటీసులు జారీ చేస్తున్నట్లు వివరించారు. స్పందించని యజమానులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

నర్సరీని సందర్శించిన కర్నాటక మంత్రి


మొక్కల వివరాలు తెలుసుకుంటున్న కర్నాటక మంత్రి మల్లికార్జున్

కడియం: బుర్రిలంకలోని ఏకేఎస్‌వీ నర్సరీని కర్నాటక మైనింగ్, జియాలజీ, హార్టికల్చర్ శాఖల మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్ శుక్రవారం సందర్శించారు. నర్సరీ అధినేత, సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప ఆయనకు ఘనంగా స్వాగతం పలికి వివిధ రకాల మొక్కలను గురించి వివరించారు. అరుదైన ఆయుర్వేద, పండ్ల సంబంధిత మొక్కల గురించి మంత్రి వివరాలు అడిగారు. అనంతరం గౌతమి, కోదండరామ, సత్యనారాయణ, శివాంజనేయ నర్సరీలను మంత్రి మల్లికార్జున్ సందర్శించారు.

క్లుప్తంగా

శాకంబరిగా కనకదుర్గమ్మ


శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్ తోట నరసింహారావుపేట చదును పట్లో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ శుక్రవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి భక్తులు ప్రత్యేక సారె సమర్పించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అమ్మవారికి అలంకరించిన కూరగాయలను భక్తుల కోరిక మేరకు వితరణ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

టౌన్ హైస్కూల్‌కు కుర్చీల వితరణ


కుర్చీలు అందజేస్తున్న జీఎస్‌ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు

కంబాలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో ఒత్తిడి లేని, నాణ్యమైన విద్య అందుతుందని డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ అన్నారు. స్థానిక మున్సిపల్ టౌన్ హైస్కూల్‌కు శుక్రవారం జీఎస్‌ఆర్ ఫౌండేషన్ తరఫున రూ.10 వేల విలువైన కుర్చీలను సమర్పించారు. ప్రధానోపాధ్యాయుడు ఎ.సూరిబాబు తమ పాఠశాలలో సభా వేదిక లేదని, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలకు, సమావేశాలకు సభావేదిక ఆవశ్యకత ఉందని తెలిపారు. దానికి తమ ట్రస్ట్ తరఫున సాయం అందజేస్తామని రవికిరణ్ హామీ ఇచ్చారు.

సమాజ హితం కోసం మొక్కలు పెంచాలి


గ్రీన్ ఇండియా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కంబాలచెరువు: సమాజ హితం కోసం మొక్కలు పెంచాలని సీతంపేట చైతన్య స్కూలు ప్రిన్సిపాల్ పి.మహేశ్వరరావు అన్నారు. గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులతో మొక్కలు నాటించారు. వాటిని సంరక్షించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో రీజినల్ ఇన్‌చార్జ్ ఉదయ్‌శంకర్, ఏజీఎం ఎంవీ సురేష్, అకడమిక్ కో ఆర్డినేటర్ కిరణ్‌పాండే, డీన్ సాయికిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్ట్ ఫోన్ వాడకంతో అనేక సమస్యలు

సీటీఆర్‌ఐ: స్మార్ట్ ఫోన్ ఎక్కువ సేపు చూడడం వల్ల కళ్లు పొడిబారడం, తలనొప్పి, అలసట వంటి సమస్యలు తలెత్తుతాయని మ్యాక్సీ విజన్ ఐ హాస్పిటల్ హెడ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక ప్రియంవద అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూత్ రెడ్ క్రాస్, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కంటి సమస్యలను అధిగమించడానికి ప్రతి 20 నిమిషాలకు ఓసారి విరామం తీసుకోవాలన్నారు. డిజిటల్ స్క్రీన్‌కు కొంచెం దూరంగా ఉండడానికి ప్రయత్నించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి డాక్టర్ సలహాలు పాటిస్తూ, కంటి విషయంలో జాగ్రత్త వహించాలని కోరారు.

మల్లయ్యపేటలో దుమ్ము సమస్యను పరిష్కరిస్తాం

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులోని మల్లయ్యపేటలోని దుమ్ము సమస్యను పరిష్కరిస్తామని రూరల్ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్ తెలిపారు. గత కొంత కాలంగా సేవ్ మల్లయ్యపేట పేరుతో స్థానికులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు తహసీల్దార్, ఎంపీడీవోలు శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇసుకలారీల ఓవర్ లోడుతో పాటు, ర్యాంపు నుంచి పెట్రోలు బంకు వచ్చే రోడ్డు శిథిలమవ్వడంతో ఇసుక లారీలతో ఆ మట్టి టైర్లుకు అంటుకుని మల్లయ్యపేటరోడ్డు పైకి వచ్చి చేరుతోంది. దీనివల్ల విపరీతంగా దుమ్మలేచి షాపుల్లోకి వెళ్లడంతో పాటు, వాహన చోదకులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్, ఎంపీడీవోలు సదరు ఇసుక కాంట్రాక్టరును పిలిపించి పెట్రోలు బంకు నుంచి ఇసుక ర్యాంపు వెళ్లే రోడ్డు వేస్తే కొంత సమస్య తీరుతుందని తెలిపారు. అలాగే మల్లయ్యపేట రోడ్డును శనివారం పూర్తిస్థాయిలో శుభ్రం చేయించడం జరుగుతుందన్నారు. ఇసుక ఓవరులోడు లేకుండా ఒక అధికారి పర్యవేక్షిస్తాడని తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

రాజమహేంద్రవరం రూరల్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలలో విజేతలకు శుక్రవారం నగదు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. చిత్రలేఖనంలో పులగుర్త జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు పావని, రూప ప్రథమ, తృతీయ స్థానాల్లో, శాటిలైట్ సిటీ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థిని సత్య రమ్యశ్రీ ద్వితీయ స్థానంలో నిలిచారు. వ్యాసరచన పోటీలలో పులగుర్త జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కుసుమ ప్రథమ, బొమ్మూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థిని ధనశ్రీ ద్వితీయ, శాటిలైట్ సిటీ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థిని అక్షయ దీపిక తృతీయ స్థానాలను సాధించారు. జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాలు, నివారణ చర్యల గురించి ఛాత్రోపాధ్యాయులు, హాజరైన పిల్లలకు చక్కని అవగాహన కలిగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సూర్యనారాయణ, చూడామణి, రాజేష్, జిలానీ బాషా పాల్గొన్నారు.


బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొన్న డైట్ ప్రిన్సిపాల్ జయశ్రీ తదితరులు

మధ్యవర్తిత్వంపై శిక్షణ ప్రారంభం

కంబాలచెరువు: మధ్యవర్తిత్వ శిక్షణ అనేది ఒక అభ్యాసం మాత్రమే కాక సహనశీలత, పరస్పర గౌరవం, చర్చా పద్ధతుల్లో మానవీయతకు మార్గం చూపే ప్రక్రియ అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని సమావేశ మందిరంలో మధ్యవర్తిత్వంపై శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయ మధ్యవర్తిత్వంపై ప్రొఫెషనల్, ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కేరళ మధ్యవర్తిత్వ కేంద్రానికి చెందిన సీనియర్ ట్రైనర్లు వీపీ.థాంకచన్, పీజీ.సురేశ్‌లు శిక్షణ అందిస్తున్నారన్నారు. ఈ శిక్షణ ద్వారా సమస్యల పరిష్కారానికి సహకార దక్పథాన్ని అభివృద్ధి చేసుకుంటామన్నారు. కుటుంబాల్లో, కార్యాలయాల్లో, సమాజాల్లో వివాదాలు సహజంగా వస్తాయన్నారు. వాటిని ఎలా పరిష్కరించాలన్న దానిపై మన ధోరణి ముఖ్యమన్నారు. మధ్యవర్తిత్వ సూత్రాలు, విధానాలు, కేస్ స్టడీలు, ప్రాక్టికల్ వినియోగం, సీనియర్ నిపుణుల అనుభవాలను తెలుసుకుంటూ వాటిని ఆచరణ సాధ్యం చెయ్యడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ముఖ్యంగా 2023 మధ్యవర్తిత్వ చట్టం ప్రవేశంతో ఇది మరింత కీలకమైన ప్రక్రియగా మారిందన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 86 మంది న్యాయవాదులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంటి విషయంలో అలక్ష్యం వద్దు


కళ్లజోళ్లు అందిస్తున్న హరిత దళం సభ్యులు

సీటీఆర్‌ఐ: కంటి విషయంలో అలక్ష్యం వద్దని రాజమహేంద్రవరం చాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ కొయ్యాన కుమారి అన్నారు. ఆమెన్ ట్రస్ట్ దేవరపల్లి సౌజన్యంతో హరిత దళం స్వచ్ఛంద సంస్థ శుక్రవారం స్థానిక సుబ్బారావు నగర్‌లో కంటి వైద్య శిబిరం నిర్వహించింది. ఈ సందర్భంగా వీధుల్లో చెత్తఏరుకునే సుమారు 30 మందికి కంటి పరీక్షలు చేసి కళ్లజోళ్లు అందించారు. కుమారి మాట్లాడుతూ చూపు విషయంలో శ్రద్ధ తీసుకుని నేత్ర వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు, కళ్లజోళ్లు అందజేస్తున్న హరిత దళం సేవలు అభినందనీయమన్నారు. ఆమెన్ ట్రస్టు డైరెక్టర్ పి.ఎవాంజలిన్ మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా పేదవారికి శిబిరాలు నిర్వహిస్తూ అనేకమందికి వైద్యసేవలు అందజేస్తున్నామన్నారు. మరో స్వచ్ఛంద సంస్థ గ్రేస్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రోగులకు దుప్పట్లు చీరలు పంపిణీ చేశారు. ఆ ట్రస్టు డైరెక్టర్ రోషన్ వర్జిల్ వాసా మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో 50 మంది కమ్యూనిటీ సభ్యులు, హరిత దళం మేనేజర్ వై.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత


వాక్‌థాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఓఎన్‌జీసీ అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతానుదాస్

- ఓఎన్‌జీసీ అసెట్ మేనేజర్ శాంతానుదాస్
- ఉత్సాహంగా వాక్ థాన్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పరిసరాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత అని ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అసెట్ మేనేజర్ శాంతానుదాస్ అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న స్వచ్ఛత పక్వాడ 2025 ప్రచారంలో భాగంగా ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ ఆధ్వర్యంలో శుక్రవారం కంబాల చెరువు నుంచి పుష్కరఘాట్ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. పరిశుభ్రత, వ్యర్థాల విభజనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ వాక్‌థాన్‌ను శాంతానుదాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 2016లో భారత ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛత పక్వాడా లక్ష్యాలకు అనుగుణంగా ఓఎన్‌జీసి పనిచేస్తుందన్నారు. సీఎస్‌ఆర్ కార్యక్రమాల ద్వారా పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తోందన్నారు. చెత్త వేయడం, ఘన వ్యర్థాల నిర్వహణలో పెరుగుతున్న సవాళ్లపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రజా స్థలాలను కాపాడుకోవడంలో పౌరులందరూ ఐక్యంగా ఉండాలని దాస్ కోరారు. పక్షం రోజుల పాటు జరిగే స్వచ్ఛత పక్వాడా ప్రచారం ఈ నెల ఒకటిన ప్రారంభమై 15వ తేదీన ఓఎన్‌జీసీ రాజమండ్రిలో ముగుస్తుందన్నారు.

15 డ్రెడ్జింగ్ బోట్ల స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా లీగల్ శాండ్ అథారిటీ ఆదేశాల మేరకు శుక్రవారం డీసిల్టేషన్ రీచ్‌లను జిల్లా గనులు, భూగర్భ శాఖ, తహసీల్దార్ కార్యాలయం, జలవనరుల శాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ధవళేశ్వరం 3.65 , 5.7, రాజమహేంద్రవరం అర్బన్ (కోటిలింగాలపేట) 11.900 , కాతేరు 12.70 ర్యాంపుల వద్ద తనిఖీల్లో అనధికారికంగా ఇసుకను డ్రెడ్జింగ్ బోట్ల ద్వారా తవ్వుతున్నట్లు గుర్తించారు. ర్యాంపుల నందు డిసిల్టేషన్ కార్యకలాపాలు చేపట్టడానికి బోట్‌మన్ సొసైటీలకు మనుషుల ద్వారా ఇసుకను తవ్వి బోట్ల ద్వారా తరలించడానికి అనుమతి ఉంది. కానీ డ్రెడ్జింగ్ బోట్ల ద్వారా ఇసుకను తవ్వినట్లు తనిఖీలో గుర్తించారు. దీంతో ధవళేశ్వరం, కోటిలింగాలపేట, కాతేరులలో అక్రమంగా ఇసుక తవ్వుతున్న 15 డ్రెడ్జింగ్ బోట్లును స్వాధీనం చేసుకున్నారు.


డ్రెడ్జింగ్ బోట్లను తనిఖీ చేస్తున్న అధికారులు

తాటాకిల్లు దగ్ధం

సీతానగరం: మండలంలోని సింగవరంలో ములగ అప్పలరాజుకు చెందిన తాటాకిల్లు శుక్రవారం దగ్ధమైంది. అప్పలరాజు తన భార్యతో కలసి గ్రామంలోని అల్లుడి ఇంటి దగ్గరలో గల తాటాకిల్లులో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పాకలోని గ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో లోపల ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రాజమహేంద్రవరం నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపు చేసింది. ఈ ప్రమాదంలో ఇంటిలోని ఫ్యాన్, టీవీతో పాటుఆధార్, రేషన్ కార్డులు, మంచాలు, వంట సామగ్రి, రూ 30 వేలు కాలిపోయాయి.


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన తాటాకిల్లు

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: రాంగ్ రూట్‌లో వచ్చిన ఆటో ఢీకొనడంతో మోటార్ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి మృతి చెందాడు. శాటిలైట్ సిటీకి చెందిన చెందిన దివిలి మల్లేశ్వరరావు (48) బంగారం పని చేస్తుంటాడు. ఆయన గురువారం ఉదయం 9 గంటలకు తాడితోట పనికి వెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి వస్తుండగా మోరంపూడి పిట్లవానిచెరువు వద్ద మోటర్‌సైకిల్‌ను రాంగ్‌రూట్‌లో వచ్చిన ఆటో బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లేశ్వరరావు తీవ్ర గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మల్లేశ్వరరావు భార్య గోవిందమ్మకు శుక్రవారం ఆస్పత్రి వద్ద నుంచి ఫోన్ రాగా, అక్కడ మార్చురీలో ఉన్న వ్యక్తి తన భర్తని గుర్తించింది. ఆమె ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై కె.రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రంగంపేట: గడ్డిమందు పిచికారీ చేస్తుండగా అస్వస్థతకు గురైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఏఎస్ఐ వీవీ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రంగంపేట గ్రామానికి చెందిన చెక్కపల్లి వీర వెంకట దుర్గారావు ఈ నెల 9వ తేదీన తన పొలంలో గడ్డి మందు పిచికారీ చేశారు. ఆ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోలేదు. దీంతో సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్సకోసం కాకినాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 10వ తేదీ రాత్రి ఎనిమిదిన్నర గంటలకు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి చనిపోయినట్టు తెలిపారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆషాఢాం.. అమ్మకాలు శూన్యం


కోటగుమ్మం సెంటర్‌లో కొనుగోలుదారులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న షాపులు


మెయిన్ రోడ్డులో అంతంతమాత్రంగానే కనిపిస్తున్న జనం

- మార్కెట్ వెలవెల
- విపరీతంగా తగ్గిన అమ్మకాలు
- శుభకార్యాలు లేకపోవడమే కారణం

ప్రకాశం నగర్: ఆషాఢమాసం సందర్భంగా రాజమహేంద్రవరంలోని ప్రధాన మార్కెట్లు కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్నాయి. హిందూ సంప్రదాయం ప్రకారం ఆషాఢ మాసంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు ముహూర్తాలు ఉండవు. జూన్ 26న ప్రారంభమైన ఆషాఢం జూలై 24 వరకూ ఉంది. అలాగే జూలై 8 వరకు గురు మౌఢ్యమి ఉండడంతో పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలు ఉండవు. దీంతో ఆయా శుభ కార్యక్రమాలకు అవసరమైన దుస్తులు, బంగారం, ఇతర పూజా సామగ్రి, కిరాణా, ఫాన్సీ వస్తువుల అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. దీంతో వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని మెయిన్ రోడ్డు, కోటగుమ్మం సెంటర్, గుండువారి వీధి, టౌన్ హాలు రోడ్డుతో పాటు తాడితోట మహాత్మాగాంధీ హోల్‌సేల్ క్లాత్ మార్కెట్, చందన మార్కెట్ తదితర చోట్ల ఆశించిన స్థాయిలో అమ్మకాలు లేవు.

ఉపాధిపై తీవ్ర ప్రభావం

శుభ కార్యాలు లేకపోవడంతో ఆయా రంగాలపై ఆధార పడిన కేటరింగ్ సిబ్బంది, వంట మనుషులు, సప్లయి కంపెనీ, లైటింగ్, డెకరేషన్ కార్మికులు, కల్యాణ మండపాల సిబ్బంది ఉపాధి కోల్పోతున్నారు. ముఖ్యంగా వస్త్ర వ్యాపారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. కార్పొరేట్ వ్యాపార సంస్థల్లో సైతం ఆశించిన స్థాయిలో విక్రయాలు లేవు. దీంతో ఆయా బంగారం, దుస్తుల దుకాణాలు కొనుగోలుదారులకు ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నాయి. ప్రత్యేక డిస్కౌంట్లతో పాటు లక్కీ డ్రాలో కార్లు, గృహోపకరణాలను బహుమతులుగా ఇస్తున్నారు.

అంతంత మాత్రమే

జూన్‌లో మౌఢ్యమి, జూలైలో ఆషాఢ మాసాలు ఉండడంతో జూలై 25న ప్రారంభమయ్యే శ్రావణం వరకూ వ్యాపారాలు అంతంత మాత్రంగానే ఉంటాయని, ఆగస్టు నుంచి పుంజుకునే అవకాశం ఉందని వర్తక ప్రతినిధులు చెబుతున్నారు. సామాన్యంగా సీజన్‌తో పోలిస్తే 40 శాతం అమ్మకాలు లేకపోవడంతో ఈ రెండు మాసాలు షాపు అద్దె, కరెంట్ బిల్లులు, కార్మికుల జీతాలు, రోజు వంటి ఖర్చులు వంటివి అదనపు భారంగా మారతాయన్నారు.

ఆశించిన స్థాయిలో లేవు

గత రెండు మాసాల్లో వ్యాపారాలు ఆశించిన స్థాయిలో లేవు. ముఖ్యంగా వస్త్ర వ్యాపార రంగంలోకి కార్పొరేట్ సంస్థలు వచ్చేశాయి. సామాన్యులు సైతం షాపింగ్ మాల్స్‌లో వస్త్రాలు కొనుగోలు చేస్తున్నారు. యువత ఆన్‌లైన్ షాపింగ్ యాప్‌ల్లో వస్త్రాల కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతోంది. దీంతో చిన్న, మధ్య తరహా వ్యాపారాలు మూతపడే పరిస్థితి ఏర్పడింది.

– సత్యనారాయణ, వస్త్ర వ్యాపారి